


## అసెంబ్లీ సెక్రటరీపై మంత్రి పొన్నం అసహనం

హైదరాబాద్, మార్చి 12 (నమస్తేతెలంగాణ): అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులుపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసహనం వ్యక్తంచేశారు. అసెంబ్లీ సమావేశాలకు వచ్చే జర్నలిస్టులకు పాస్‌ల జారీలో నిర్లక్ష్యంపై, వారి వద్ద ఇంకా పాత కార్డులే ఉండటం ఏంటని ప్రశ్నించారు. ఎప్పుడు మారుస్తారంటూ నిలదీశారు. నూతన కమిటీ ఏర్పాటు చేస్తామని, కొత్త కార్డులు జారీ చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించినట్టు సమాచారం.

## సినిమా నటులకు ఓట్లేస్తరా?

- ఎమ్మెల్సీ అభ్యర్థి విజయశాంతిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే పటోళ్ల వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): సినీనటులకు జనం వస్తారేమో కానీ, ఓట్లు పడవని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో పీసీసీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న విజయశాంతిని తన నియోజకవర్గానికి ప్రచారం కోసం తీసుకెళ్లాలని సూచిస్తే, ఆమె వస్తే తనకే మైనస్ అవుతుందని ప్రచారం చేయించలేదని చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ముచ్చటిస్తూ ఆయన ఈ విషయాలను వెల్లడించారు.

## ఢిల్లీ స్థాయిలోనే మంత్రి పదవులపై నిర్ణయం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (నమస్తేతెలంగాణ): మంత్రివర్గంలోని తనను తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమైనా, ఖరారు చేయాల్సింది మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానమేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. 'విజయశాంతి ఢిల్లీకి పోయి ఎమ్మెల్సీ తెచ్చుకున్నారు. మంత్రి పదవి కూడా అంతే. అధిష్ఠానం ఎవరికి ఇవ్వాలనుకుంటే వారికే వస్తుంది. మా లాంటి వాళ్లకు మంత్రి పదవి ఇస్తే ప్రజలకు ఉపయోగం' అని అసెంబ్లీ లాబీలో బుధవారం రంగారెడ్డి వెలిబుచ్చారు.

## 4 జనరేషన్లు చూసిన.. మంత్రిగా అర్హుడినే

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (నమస్తేతెలంగాణ): 'కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నా.. ఆస్తులు కోల్పోయా. నాలుగు తరాలుగా పార్టీకి విధేయుడిగా కొనసాగుతున్న నేను మంత్రి పదవికి అన్నిరకాల అర్హుడినే' అని కాంగ్రెస్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తన మనోగతాన్ని వెలిబుచ్చారు. బుధవారం అసెంబ్లీ లాబీలో ఆయన మాట్లాడుతూ ఎన్ని ఒత్తిడిలు వచ్చినా పార్టీ మారకుండా కాంగ్రెస్‌లో ఉన్నానని చెప్పారు.

# సభ 20 రోజులు నడపాలి

- 20 శాతం కమీషన్‌పై చర్చించాలి
- రైతాంగ సమస్యలపై సమగ్ర చర్చ జరపాలి
- ప్రాజెక్టులపై లోతుగా చర్చ పెట్టాలె
- ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వద్దని బుల్డోజ్ చేయొద్దు
- మాజీ మంత్రి హరీశ్‌రావు




హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో సమగ్రంగా చర్చించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలను కనీసం 20 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్టు.. అసెంబ్లీ బిజినెస్ ముందే లీక్ అవడంపై అభ్యంతరం తెలిపాం. ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వొద్దని సీఎం స్వయంగా స్పీకర్‌ను బుల్డోజ్ చేస్తున్నారు. ఇది సరికాదని బీఏసీలో అభ్యంతరం లేవనెత్తాం. సంఖ్యాబలాన్ని బట్టి బీఆర్‌ఎస్‌కు సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరాం. తాము చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చారు. నియోజకవర్గాల అభివృద్ధి నిధులను స్పీకర్ ఇప్పించాలి' అని పేర్కొన్నారు.

### రైతాంగ సమస్యలపై సమగ్ర చర్చ

రాష్ట్రంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, శాసనసభ వారికి భరోసాను కల్పించాల్సిన అవసరం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'రైతుబంధు అందక, రుణమాఫీ కాక రైతులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలి. పెద్దవాగు కొట్టుకుపోవడం, సుంకిశాల రిటైనింగ్ వాల్, ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం, వట్టెం పంప్‌హౌజ్ మునిగిపోవడంపై అసెంబ్లీలో చర్చపెట్టాలని డిమాండ్ చేశాం. నదీజలాల వినియోగంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ విషయమై చర్చించాలని డిమాండ్ చేశాం. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయమై చర్చించాలని కోరాం. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నది. తక్షణమే ప్రాజెక్టును పునరుద్ధరించాలి' అని డిమాండ్ చేశారు.

### నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే...

కృష్ణా నదీజలాల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనిపై సభలో చర్చించాలని బీఏసీలో కోరామని హరీశ్‌రావు తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూసింది. దీనిపై సభలో చర్చించాలి. బిల్లులు చెల్లింపునకు 20 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దానిపై చర్చించాలని కోరాం. బిల్లుల కోసం ఆందోళన బాటపట్టిన మాజీ సర్పంచ్‌లకు సభ భరోసా ఇవ్వాలని కోరాం. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వందల రోజులు పూర్తయినా వాటి అమలు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై కూడా సభలో చర్చించాలని డిమాండ్ చేశాం' అని తెలిపారు.

### ఎల్‌ఆర్‌ఎస్ ఉచితమని చెప్పి...

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ఉచిత హామీపై చర్చ పెట్టాలని కోరామని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. జర్నలిస్టులను సైతం తీవ్రవాదులుగా చిత్రీకరిస్తూ అరెస్టులు చేస్తున్నారని, బీఆర్‌ఎస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తల పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించాలని కోరినట్టు తెలిపారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలుపై చర్చించాలని కోరామని హరీశ్‌రావు వివరించారు.

## హౌజ్ కమిటీలు ఎప్పుడు?

- బీఏసీలో హరీశ్ ఫైర్

'ఎస్టిమేట్స్ కమిటీని ప్రకటించి ఏడాదవుతున్నది. చైర్మన్‌గా కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిని నియమించారు. ఆమె కనీసం నామినేషన్ కూడా వేయలేదు. ఇప్పటివరకు చార్జ్ కూడా తీసుకోలేదు. మరోపక్క ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ)కి నామినేషన్ వేయనివాళ్లను చైర్మన్ చేస్తారు.. అదే పదవికి నా నామినేషన్‌ను ఎందుకు తిరస్కరించారో ఇప్పటి వరకు స్పీకర్ సభలో ప్రకటన చేయలేదు. ఇదేం పద్ధతి?' అంటూ బీఏసీ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. శాసనసభ స్పీకర్ దీనిపై స్పందించాలని కోరారు. నిబంధనల ప్రకారం తన నామినేషన్ తిరస్కరణకు గురైతే ఆ విషయాన్ని సభలోనే ప్రకటించాల్సి ఉంటుందని హరీశ్‌రావు చెప్పారు. శాసనసభలో హౌజ్ కమిటీలు ముఖ్యమైనవని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు కమిటీలను ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. హరీశ్‌రావు ప్రశ్నలకు స్పీకర్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదు. శాసనసభలో సమయపాలన లేకుండా పోయిందని, దీని వల్ల శాసనసభపై దురాభిప్రాయం పెరుగుతుందని, సమయపాలన పాటించేలా చూడాలని స్పీకర్‌ను కోరారు.

## లోకం పోకడ




మీరిచ్చిన క్వశ్చన్ పేపర్లలో తప్పులు దిద్దితే సరిపోతుంది గదా సార్? ఆన్సర్లు కూడా రాయమంటారా?

## దశలేని పాలనకు నిదర్శనం

- గవర్నర్ ప్రసంగంపై దేవీప్రసాద్ ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 15 నెలల కాంగ్రెస్ దశ, దిశ లేని పాలనకు అసెంబ్లీలో గవర్నర్ చేసిన ప్రసంగం నిదర్శనమని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు నిత్యం సమస్యలతో సతమతం అవుతుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం కనీసం వారికి స్వాంతన చేకూర్చే ప్రయత్నం కూడా చేయలేదని మండిపడ్డారు. వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారి కుటుంబాలకు భరోసా ఇచ్చే ప్రస్తావన లేదని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 15 నెలల పాలనలో రూ. 1.52 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం ఏమి చేసిందనే విషయాన్ని ప్రజలకు వివరించకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని ఆరోపించారు.

## వరి రైతులకు రూ.11,794 కోట్లు బాకీ

- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నిండా ముంచిందని, అసెంబ్లీలో ఏకంగా గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించారని గవర్నరే చెప్పారని, ఆ లెక్కన రూ. 13,000 కోట్లు రైతులకు చెల్లించాలని, కానీ రూ.1,206 కోట్లు ఇచ్చినట్టు ప్రసంగంలో పేర్కొన్నారని గుర్తుచేశారు. 9 శాతం మంది రైతులకు బోనస్ ఇచ్చి అందరికి ఇచ్చినట్టు ప్రచారం కోవడమేంటని ఓ ప్రకటనలో విమర్శించారు.

## గవర్నర్ నోట అబద్ధాలు పలికించారు

- కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి

అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధసత్యాలు, అబద్ధాలు పలికించిందని బీఆర్‌ఎస్ నేత వాసుదేవరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం అబద్ధమని తెలిపారు. తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, 6,000 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని మండిపడ్డారు. రైతు వేదికల నిర్మాణం, రుణమాఫీ, ఎకరానికి రూ.12,000 రైతు భరోసా, వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్, ఎల్పీజీ సిలిండర్‌పై సబ్సిడీ, హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం, పరిశ్రమల స్థాపన సహా చాలా అబద్ధపు రాతలను గవర్నర్‌తో ప్రభుత్వం మాట్లాడించిందని మండిపడ్డారు.

## అది కాంగ్రెస్ డబ్బా ప్రసంగం

- బీఆర్‌ఎస్ నేత కురువ విజయ్‌కుమార్

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ డబ్బా ప్రసంగం లాగా ఉన్నదని బీఆర్‌ఎస్ నేత కురువ విజయ్‌కుమార్ ఆక్షేపించారు. తప్పుల తడక, అబద్ధాలతో కూడిన ప్రసంగాన్ని మాట్లాడించి గవర్నర్ ఔన్నత్యాన్ని రేవంత్ సర్కార్ దిగజార్చిందని విమర్శించారు. గత బడ్జెట్ సమావేశాల్లో పాత గవర్నర్ ప్రసంగానికి, కొత్త గవర్నర్ ప్రసంగానికి పెద్ద తేడాలేదని మండిపడ్డారు. అన్ని పథకాల మీద గవర్నర్‌తో అబద్ధాలు మాట్లాడించారని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు.

# మీరా.. సామాజికన్యాయ దినోత్సవం జరిపేది?

- అంబేద్కర్ విగ్రహానికి దండ కూడా వేయలేదు
- కులగణన లెక్కలు ఎందుకు చెప్పట్లేదు?
- పరిశ్రమలు తరలిపోతుంటే.. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్తరా?
- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ప్రశ్నల వర్షం

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): కనీసం అంబేద్కర్ విగ్రహానికి దండ కూడా వేయనివాళ్లు సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుతారా? అని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. బుధవారం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ సర్కారుపై ఆయన ధ్వజమెత్తారు. కులగణన సర్వే చేశామని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, ఆ సంఖ్య మీద బీసీ సంఘాలే అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తప్ప.. వాస్తవ లెక్కలు బయటికి చెప్పడం లేదని మండిపడ్డారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ తర్వాత ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు వాపస్ పోతుంటే, సిగ్గులేకుండా గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. పరిశ్రమలు గుజరాత్, తమిళనాడు, ఏపీలకు తరలిపోతున్నాయని మీడియా కోడై కూస్తున్నదని పేర్కొన్నారు. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గొప్పలు చెబుతున్నారని కానీ, దావోస్‌లో జరిగే ఒప్పందాలు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' అని డిప్యూటీ సీఎం చెప్పారని తెలిపారు. ఒప్పందాల్లో ఎన్ని గ్రౌండ్ అయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు కుటుంబాలు రోడ్డెక్కాయని, పోలీసు సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామని గప్పాలు కొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పొగడ్తలతో బడ్జెట్ ప్రసంగాన్ని గుదిగుచ్చారని ఆరోపించారు.

# ఈ నెల 19న రాష్ట్ర బడ్జెట్

- 27 వరకు అసెంబ్లీ సమావేశాలు
- నేడు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నది. ఈ మేరకు బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ తన చాంబర్‌లో నిర్వహించిన బీఏసీ(బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశంలో నిర్ణయించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, అసెంబ్లీ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్‌ఎస్ నుంచి రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీపీఐ నుంచి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ఎంఐఎం నేతలు గైర్హాజరయ్యారు. నేడు, ఎల్లుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. 17వ, 18న రెండు రోజులు బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. ఆ తర్వాత 19న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్నది. ఈ నెల 21వ తేదీ నుంచి బడ్జెట్‌పై సాధారణ చర్చ ప్రారంభమవుతుంది. ఈ నెల 27 వరకు వివిధ పద్దులపై చర్చించిన తర్వాత అదే రోజు సభ వాయిదాపడే అవకాశమున్నది. కాగా, ఈ నెల 14న హోళీ, 16న ఆదివారం, 20వ తేదీన బడ్జెట్ తెల్లారి సభ్యుల అధ్యయనం కోసం అసెంబ్లీ వ్యవహారాలకు సెలవులు ఇవ్వాలని బీఏసీలో నిర్ణయించారు. మొత్తానికి బడ్జెట సమావేశాలు 12 రోజుల పనిదినాలుగా ఉండే అవకాశాలున్నాయి.

# స్పీకర్‌కు సుప్రీం నోటీసు

మొదటిపేజీ తరువాయి...

సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఆందోళన మొదలైనట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. సుప్రీంకోర్టు నుంచి తొలిసారి స్పీకర్‌కు నేరుగా నోటీసులు రావడంతో ఆయన ఎలా స్పందిస్తారనే విషయం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన న్యాయనిపుణులతో సంప్రదించి, కోర్టుకు సమాధానం ఇవ్వనున్నట్టు తెలిసింది. కాగా, సుప్రీంకోర్టు నోటీసులపై శాసనసభ కార్యదర్శిని, ఆయన కార్యాలయాన్ని 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఎలాంటి సమాధానం రాలేదు.

### ఉప ఎన్నికలు వస్తే కష్టమే..

పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఇటీవల ఘాటైన వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటిని గమనిస్తే ఒక పార్టీలో గెలిచి మరోపార్టీలోకి ఫిరాయించిన ప్రజాప్రతినిధుల పట్ల కోర్టు కఠిన వైఖరి అవలంబిస్తున్నట్టు కనిపిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. దీనిని బట్టి చూస్తే కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది





బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ వేగంగా తుది నిర్ణయం తీసుకునేలా సుప్రీం కోర్టు ఒత్తిడి తెస్తున్నదని భావిస్తున్నారు. ఇదే జరిగితే తమ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని ఆ ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, ఇలాంటి సమయంలో ఉప ఎన్నికలు వస్తే తాము గెలవడం కష్టమేనని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు పదవి పోయి, ఇటు గౌరవం పోయి రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలిపోతామేమోనని వారు మథనపడుతున్నట్టు సమాచారం.

# అబద్ధాలనే అందమైన భాషలో చెప్పారు

- గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదు
- 'మహాలక్ష్మి' గేమ్‌చేంజర్ అనడం సిగ్గుచేటు
- మహిళలకు రూ. 2500 ఇవ్వకుండానే అలా ఎలా అంటారు?
- విమర్శలు గుప్పించిన ఎమ్మెల్సీ కవిత


హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు కాంగ్రెస్ అధిష్ఠానం, సోనియాగాంధీ కుటుంబం బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. హామీల అమలుపై బాధ్యత తీసుకుని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియాగాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అని నిలదీశారు. సోనియాగాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలను చూసే ప్రజలు ఓట్లు వేశారని, స్థానిక కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు ఓట్లు వేయలేదని చెప్పారు. కాబట్టి తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం శాసనసభ, శాసన



మండలి ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేసిన ప్రసంగంపై ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీలేదని, ఎన్నికల సమయంలో సోనియాగాంధీ కుటుంబం వచ్చి ఇచ్చిన హామీల అమలు గురించి ప్రస్తావనేలేదని విమర్శించారు. అబద్ధాలనే మళ్లీ అందమైన భాషలో చెప్పే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఎండగడుతామని స్పష్టంచేశారు. రూ.1.5లక్షల కోట్లు అప్పులు చేసినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని, దీని మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ఈ హామీని అమలు చేయకుండానే మహాలక్ష్మి పథకం గేమ్‌చేంజర్ అని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కి నడిపిస్తూ, శుద్ధఅబద్ధాలు చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి అద్దం పడుతున్నదని తీవ్రంగా విమర్శించారు. రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయకుండానే గొప్పగా అమలు చేశామని చెప్పుకోవడం దారుణమన్నారు. ఇది ప్రభుత్వ అసమర్థతను తేటతెల్లం చేస్తున్నదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కవిత డిమాండ్ చేశారు.

# 20 ఏండ్లు నేనే సీఎం!

- బీఆర్‌ఎస్‌తో టచ్‌లో ఉంటే మీకే నష్టం
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ సభ్యుల్ని అడ్డుకోలేదని అసహనం
- గవర్నర్ ప్రసంగ సమయంలో ఎలా అడ్డుకుంటామని ఓ సీనియర్ మంత్రి చురక
- సభలో సీఎం మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేలతో సమన్వయలోపం బహిర్గతం!



హైదరాబాద్, మార్చి12(నమస్తే తెలంగాణ): 'ఎమ్మెల్యేల బలముంటేనే సీఎం అయినా, మంత్రులైనా ఉంటారు. మీ అందరి ఆశీర్వాదం నాకుంటే నేను మరో 20 ఏండ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతా' అని సీఎం రేవంత్‌రెడ్డి సీఎల్పీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బుధవారం సీఎల్పీ సమావేశం జరిగింది. ప్రతిపక్ష నేత కేసీఆర్ సమావేశాలకు హాజరవుతున్న నేపథ్యంలో ఆయనను ఎదుర్కోవడానికి సమన్వయంతో ముందుకుపోవాలని సీఎం ఈ సందర్భంగా సభ్యులకు సూచించినట్టు తెలిసింది. ఇందుకోసం ప్రతి ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి చొప్పున సమన్వయ బృందం ఏర్పాటు చేస్తామని, పార్లమెంటు తరహాలో రోజుకు మూడుసార్లు హాజరు తీసుకుంటామని, ప్రతి సభ్యుడు 100 శాతం హాజరు కలిగి ఉండాలని హెచ్చరించినట్టు తెలిసింది. ప్రతిపక్షాలు ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించినా మిగతా అందరూ స్పందించాలని చెప్పినట్టు సమాచారం. మంత్రులపైన ఫిర్యాదులు వస్తున్నాయని, మంత్రులు మాత్రమే నిధులను తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఈ సందర్భంగా సీఎం అన్నట్టు తెలిసింది.

### బీఆర్‌ఎస్ నిరసనకు దీటైన స్పందనేది?

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజున ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సభ్యులకు దీటుగా మన సభ్యుల స్పందన లేదని లేదని మంత్రులు, ప్రభుత్వ విప్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తుండగా, మధ్యలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేచి నిలబడి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారని, మన సభ్యులెవరూ వారిని అడ్డుకునే ప్రయత్నమే చేయలేదని మంత్రులు, విప్‌లపై సీఎం అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు తెలిసింది. ప్రతిపక్షాలు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం సహజమని, వారితో మనం వాదనకు దిగితే గవర్నర్ ప్రసంగం అర్థాంతరంగా ఆగిపోతుందంటూ సీఎం వ్యాఖ్యలపై సీనియర్ మంత్రి ఒకరు బదులిచినట్టు సమాచారం. దీంతో మరో అంశం మీదికి టాపిక్‌ను డైవర్ట్ చేసినట్టు తెలిసింది.

### 'నేను మాట్లాడుతుంటే మీరు బయటకెళ్తరా?'

సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం సూచనలు చేస్తుండగానే, కాంగ్రెస్ సీనియర్ నేత, జానారెడ్డి కుమారుడు, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమావేశం నుంచి బయటకు వెళ్లినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తీరుపై సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. 'నేను మాట్లాడుతున్నా కదా. మీరు బయటకెలా వెళ్తారు?' అని సహచర సభ్యులను ఉద్దేశించి అన్నట్టు తెలిసింది. ఒకవైపు తాను మాట్లాడుతుంటే, జయవీర్ అలా వెళ్తున్నారు. ఇంత నాన్ సీరియస్‌గా ఉంటే ఎలా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. తనకు తెలియకుండా జయవీర్‌కు ఏ పనులూ చేయవద్దని మంత్రులను ఆదేశించినట్టు సమాచారం. క్రమశిక్షణతో మెలిగితేనే ఎవరికైనా ఫ్యూచర్ ఉంటుందని క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది.

### బీఆర్‌ఎస్‌తో టచ్‌లో ఉంటే మీకే నష్టం

'కొంతమంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌తో టచ్‌లోకి పోతున్నట్టు తెలిసింది. అది మీకే నష్టం' అంటూ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించినట్టు తెలిసింది. 'బీఆర్‌ఎస్ పట్ల సాఫ్ట్ కార్నర్‌తో ఉంటే మీ మీద వాళ్లు పోటీ అభ్యర్థిని నిలబెట్టరని కలలు కంటున్నరేమో, వాళ్ల గురించి మీకు చాలా తక్కువ తెలుసు' అని సీఎం అన్నట్టు సమాచారం. రాజకీయాలంటే పిల్లలాట కాదని, వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలో అనే ప్లాన్‌తో పనిచేయాలని ఎమ్మెల్యేలకు సీఎం హితబోధ చేసినట్టు తెలిసింది. నిధులు రావడం లేదని ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని, కొన్ని సమస్యలు ఉన్నమాట నిజమేనని, త్వరలో జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో లంచ్ సమావేశాలు పెట్టి సమస్యలు పరిష్కరిస్తామని, కానీ ఎమ్మెల్యేలు ఎవరూ డిన్నర్ సమావేశాలు పెట్టుకోవద్దని సూచించినట్టు తెలిసింది. అలాంటి వారిపై కఠనంగా ఉంటామని హెచ్చరించినట్టు సమాచారం. నియోజకవర్గ నిధుల సర్దుబాటుపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు తెలిసింది.

### సీఎం నాయకత్వ సామర్థ్యంపై అనుమానాలు

ప్రభుత్వంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేదనే విషయం కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో మరోసారి బహిర్గమైనదని కాంగ్రెస్ శ్రేణులే అంటున్నాయి. ఒకవైపు సభలో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తుండగానే, మరోవైపు సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. సీఎం సూచనలకు మంత్రులు మధ్యలో అడ్డు తగిలి అలా చేయడం కుదరదనే అభ్యంతరాలను వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వ సామర్థ్యంపైనే అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# కేటీఆర్‌పై కోడ్ ఉల్లంఘన కేసు కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై ముషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును బుధవారం హైకోర్టు కొట్టేసింది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా బాణసంచా కాల్చడంతోపాటు ప్రజలకు అసౌకర్యం కలిగించారంటూ అప్పటి ఎస్సై ఆర్ ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసును కొట్టివేయాలని ముఠా గోపాల్, కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపిస్తూ.. ఇది రాజకీయ ప్రేరేపిత కేసని పేర్కొన్నారు. పోలీసులు నమోదు చేసిన అభియోగాలకు ఎలాంటి ఆధారాలు లేవని, సాక్షులంతా పోలీసులేనని, స్వతంత్ర సాక్షులు లేరని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలను పరిశీలిస్తే ముఠా గోపాల్, కేటీఆర్‌పై కేసును కొనసాగించేందుకు సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. అభియోగాలను నిరూపించే ఆధారాలు లేనందున కేసును కొట్టేస్తున్నట్టు ప్రకటించారు.

# మేడిగడ్డ సందర్శనకు అనుమతి అవసరమా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించడానికి అనుమతులు అవసరమా అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఒకవేళ అనుమతులు అవసరమనుకుంటే దానికి సంబంధించిన ఉత్తర్వులు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని స్పష్టం చేసింది. అధికారిక రహస్యాల చట్టం కింద ఒక ప్రాంతాన్ని నిషేధిత ప్రదేశంగా ప్రకటించాలంటే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉటుందని, అలా మేడిగడ్డకు సంబంధించి కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్ ఏమైనా ఉంటే సమర్పించాలని ఆదేశించింది. దీనితోపాటు ఈ కేసులో నమోదు చేసిన 8 మంది సాక్షుల వాంగ్మూలాలను సమర్పించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

# ఆగని సీఎం ఢిల్లీ ప్రదక్షిణలు

- 39వసారి ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నేడు విదేశాంగ మంత్రి జయశంకర్‌తో భేటీ?

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి 39వసారి ఢిల్లీ వెళ్లారు. బుధవారం సాయంత్రం బయల్దేరిన ఆయన ఢిల్లీకి రాత్రి చేరుకున్నారు. గురువారం ఉదయం సీఎం విదేశాంగశాఖ మంత్రి జయశంకర్‌తో భేటీ అయ్యే అవకాశం ఉంది. కాగా.. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న జయశంకర్ బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. గురువారం ఉదయం తర్వాత కానీ వీరి భేటీపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.